సాక్షి
రాజన్న సిరిసిల్ల

శనివారం । 25 । నవంబర్ । 2023



భద్రతవలయం
సిరిసిల్లక్రైం: సిరిసిల్లలోని కాలనీలన్నింటిని కేంద్ర సాయుధ బలగాలతో కలిసి పట్టణ పోలీసులు చుట్టేస్తున్నారు. నిర్భయంగా ఓటు వేయాలని ఓటర్లకు సూచిస్తున్నారు.



వైభవంగా కృష్ణతులసీ కల్యాణం
వేములవాడ: రాజన్న ఆలయంలో శుక్రవారం రాత్రి కృష్ణతులసీ కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకబృందం ఆధ్వర్యంలో ఈ వేడుక జరిపారు.

గరిష్టం/కనిష్టం
26.0/22.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పిల్లలు తప్పుచేస్తే తల్లిదండ్రులకూ శిక్ష
- సీనియర్ సివిల్ జడ్జి ఆర్.శ్రీలేఖ



మాట్లాడుతున్న ఆర్.శ్రీలేఖ

సిరిసిల్లటౌన్: పిల్లలు తప్పు చేస్తే.. వారితోపాటు తల్లిదండ్రులను సైతం చట్టం శిక్షిస్తుందని సీనియర్ సివిల్‌జడ్జి ఆర్.శ్రీలేఖ పేర్కొన్నారు. న్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. కొన్ని సందర్భాలలో పిల్లలు తెలియకుండా తప్పు చేసి శిక్షలకు గురై తారన్నారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకుంటే తప్పులు చేయకుండా ఉంటారన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రిన్సిపాల్ రఘునందన్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బుర్ర వెంకటేశంగౌడ్, న్యాయవాదులు బూర కళ్యాణి, పర్శరాములు, పెంట శ్రీనివాస్, ఆడెపు వేణు, గుర్రం ఆంజనేయులు పాల్గొన్నారు.

'ధనస్వామ్యాన్ని బద్ధలు కొట్టండి'
- జై భారత్ జస్ట్ ఓట్ క్యాంపెయిన్ నాయకుడు సత్యనారాయణ



సిరిసిల్లటౌన్: ధనస్వామ్యాన్ని బద్ధలు కొట్టండి..ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టండి.. అని జై భారత్ జస్ట్ ఓట్ క్యాంపెయిన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖదిజ్ఞాసి సత్యనారాయణ గోల కోరారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఓటుహక్కు వినియోగించుకోవడంపై ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఓటును నోటుకు అమ్ముకుంటే బతికున్నా శవంతో సమానమన్నారు. నాయకులు డబ్బులు ఆశచూపితే మరో ఐదేళ్లపాటు మోసపోవడం ఖాయమన్నారు. ప్రతి ఒక్క ఓటరు ఓటుహక్కును వినియోగించుకుని నూరుశాతం పోలింగ్ జరిగేలా చూడాలన్నారు. ఖదిజ్ఞాసి సుధాకర్ తదితరులున్నారు.

ఆర్టీసీ బస్సులో చెలరేగిన మంటలు



ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు

సిరిసిల్లటౌన్: ఆర్టీసీ బస్సులో అకస్మాత్తుగా మంటలు చెలరేగగా.. డ్రైవర్ చాకచక్యంతో ప్రయాణికులను కాపాడాడు. స్థానికులు తెలిపిన వివరాలు. సిద్దిపేట డిపోకు చెందిన బస్సు(టీఎస్ 36టీ 1585) సిరిసిల్ల పాతబస్టాండు నుంచి వేములవాడకు వెళ్తుండగా కొత్తచెరువు సమీపంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన డ్రైవర్ బస్సును పక్కకు ఆపి ప్రయాణికులను కిందకు దింపడంతో అందరూ ప్రాణాలతో బయటపడ్డారు. షార్ట్‌సర్క్యూట్‌తోనే బస్సులోని వైరింగ్ కాలిపోయినట్లు తెలిపారు. ఆర్టీసీ అధికారులు రిపేరు చేస్తున్నారు.

అకాల వర్షం తడిసిన ధాన్యం



ముస్తాబాద్(సిరిసిల్ల): అకాల వర్షం అన్నదాతలను ఆగం చేసింది. ముస్తాబాద్ మండలంలో శుక్రవారం కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. ముస్తాబాద్, పోతుగల్, నామాపూర్, తెర్లుమద్ది, వెంకయ్యకుంట కొనుగోలు కేంద్రాల్లో వర్షం పడడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ధాన్యం తడిసిపోగా, పలుచోట్ల వరదకు కొట్టుకుపోయింది. అధికారులు టార్పాలిన్లు ఇవ్వకపోవడంతో ధాన్యం తడిసిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ వద్ద ఉన్న కొద్దిపాటి కవర్లను కప్పామని, ధాన్యం మాత్రం తడిసిందన్నారు. రెండు రోజులుగా మేఘావృతమైందని తెలిసినా అధికారులు టార్పాలిన్లు ఇవ్వలేదన్నారు. తడిసిన వందల క్వింటాళ్ల ధాన్యాన్ని అధికారులు సకాలంలో కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆలోచించి ఓటెయ్యండి



బహిరంగ సభకు హాజరైన నాయకులు

- ఉద్యమకారుడు కోరుకంటి చందర్‌ను గెలిపించండి
- రామగుండాన్ని పారిశ్రామిక వాడగా మారుస్తాం
- గోదావరిఖని ప్రజా ఆశీర్వాదయాత్ర సభలో సీఎం కేసీఆర్



మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

సాక్షి, పెద్దపల్లి: 'ఎన్నికలు వచ్చాయంటే ఆగం కావొద్దు.. ఆలోచించి ఓటేయాలి. తెలంగాణ ప్రజల హక్కుల కోసం పుట్టిన పార్టీ బీఆర్‌ఎస్. ఎన్నికల్లో నిలబడిన అభ్యర్థుల వెనుక ఉన్న పార్టీలను చూడాలి. వాటి నడవడిక, దృక్పథం ఏంటో తెలుసుకోవాలి. కత్తి ఒకరికి ఇచ్చి యుద్ధం గెలవమంటే ఎట్లా?' అని సీఎం కేసీఆర్ అన్నారు. శుక్రవారం రామగుండం అసెంబ్లీ నియోజకవర్గంలోని గోదావరిఖని జవహర్‌లాల్ సింగరేణి స్టేడియంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ.. సింగరేణి తెలంగాణ కొంగుబంగారమని, అటువంటి సింగరేణిని ముంచింది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. వారసత్వ ఉద్యోగాలు ఊడగొట్టింది, 49శాతం వాటా కేంద్రప్రభుతావనికి అప్పజెప్పింది కాంగ్రెస్ పార్టీయే అనేక విషయాన్ని కార్మికులు గుర్తుంచుకోవాలని సూచించారర. కోరుకంటి చందర్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని, ఆయన తెలంగాణ ఉద్యమకారుడని అన్నారు. ఉద్యమ కాలంలో 74రోజులపాటు జైల్లో ఉన్నారని గుర్తుచేశారు. ఆయన కూడా సింగరేణి కార్మికుడి కుమారుడేనని, సింగరేణి గురించి బాగా అవగాహనం ఉందని చెప్పారు. ఇక్కడ బొగ్గు, నీళ్ల తదితన వనరులు ఉన్నాయయని, రవాణా వసతి ఉందని, రైలు మార్గం ఉందని, అయినా, పరిశ్రమలు లేవని చందర్ చెప్పారని సీఎం అన్నారు. సమైక్య రాష్ట్రంలో రామగుండం నిర్లక్ష్యానికి గురైందని, మనం ఇప్పుడు కుదుటపడ్డామని తెలిపారు. ఈ ప్రాంతానికి రావాల్సిన పరిశ్రమల గురించి ఆలోచించి తీసుకువస్తానని మాట ఇచ్చారు. పారిశ్రామిక వాడగా అభివృద్ధి చేసుకుందామని కేసీఆర్ తెలిపారు.

ఆంధ్రాలో కలిపిందే కాంగ్రెస్

×తెలంగాణను ఆంధ్రాలో కలిపిందే కాంగ్రెస్. గోదావరి ఒరుసుకుంటూ పారే మంచిర్యాల, కరీంనగర్ జిల్లాల్లో మంచినీళ్ల గోస, కరెంటు గోస, చేనేత కార్మికుల చనిపోవుడు, రైతులు ఆత్మహత్యలు చేసుకునుడు, కరెంట్ ఇస్తే తెల్లందాక ఇంత, పొద్దందాకా ఇంత, ఆడ పాములు కరిచి చనిపోవుడు.. ఇలా విపరీతమైన బాధలు పడ్డాం' అని సీఎం అన్నారు. సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాలు ఉండేవని, వాటిని ఊడగొట్టింది కాంగ్రెస్సే కదా? అని ప్రశ్నించారు. గవర్నమెంట్ కాంగ్రెస్సేనని, ఒప్పందాలపై సంతకాలు పెట్టి ఉన్న హక్కులను పోగొట్టారని ధ్వజమెత్తారు. తెలంగాణ వచ్చిన తర్వాత దాన్ని పునరుద్ధరించుకున్నామని అన్నారు. అంతేకాకుండా 15వేల మందికి ఉద్యోగాలు ఇచ్చుకున్నామని చెప్పారు. కాంగ్రెస్‌వాళ్లు ఉన్నప్పుడు ఇవ్వలేదని, తాము ఇస్తుంటే ఓరుస్త లేరని విమర్శించారు.

అలరించిన ఆట–పాట

సింగరేణి స్టేడియంలో నిర్వహించిన సభకు భారీగా జనం తరలిరాగా, ఏపూరి సోమన్న తన ఆటాపాటలతో జనాలను ఉరుత్తలూగించారు. 'గుర్తు గుర్తుంచుకో రామక్క' ఆలపించిన సమయంలో స్టేడియంలో గులాబీ శ్రేణులు సైతం పాదం కలిసి నృత్యాలు చేశారు. సీఎం కేసీఆర్ ప్రసంగిస్తున్న సమయంలో గులాబీ శ్రేణులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. అయితే, 'గోదావరిఖని కదా.. జరగట్లనే ఉంటుంది' అని సీఎం కేసీఆర్ పేర్కొంటూ సభికులను మరింత ఉత్సాహపరిచారు.

గోదవరి నదిపై కేబుల్ బ్రిడ్జి నిర్మించాలి : కోరుకంటి

గోదావరి నదిపై కేబుల్ బ్రిడ్జ్ నిర్మించి, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి. అలాగే అన్ని వనరులు కలిగి ఉన్న రామగుండం నియోజకవర్గానికి పరిశ్రమలు తీసుకొచ్చి, స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి. సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలి. కేసీఆర్ మళ్లీ సీఎం అయ్యాక రామగుండం వచ్చి సమస్యలపై సమీక్షించి పరిష్కారించాలని కోరుతున్నా.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి

ఎస్పీ అఖిల్ మహాజన్



భద్రత సూచనలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్


సిరిసిల్లక్రైం: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సిరిసిల్ల పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుభాష్‌నగర్, శివనగర్, వెంకంపేట, పెద్దూరు, అంబేడ్కర్‌నగర్, నెహ్రూనగర్, గోపాల్‌నగర్, గాంధీనగర్‌లలోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ ఎవరైనా చట్టవిరుద్ధంగా ప్రవర్తించినా, గొడవలు సృష్టించాలని చూసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయా ప్రాంతాల్లో వీలైనన్ని సార్లు ఫ్లాగ్‌మార్చ్, రూట్‌మార్చ్, వాహనాల తనిఖీలు నిర్వహించి ఓటర్లకు భద్రతాభావాన్ని కల్పించాలని సూచించారు. డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్ తదితరులు ఉన్నారు.

నారీ.. ప్రాధాన్యమేది?

జంగ్ తెలంగాణ

ఓట్లున్నా.. సీట్లు లేవు

- ఉమ్మడి జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాలు
- పురుష ఓటర్లు 14,40,023
- మహిళా ఓటర్లు 14,96,622
- బీఆర్‌ఎస్ నుంచి 0, బీజేపీ నుంచి 04, కాంగ్రెస్ నుంచి 0, బీఎస్పీ నుంచి 01
- మహిళలను విస్మరించిన ప్రధాన రాజకీయ పార్టీలు
- అతివకు అసెంబ్లీకి దక్కని ప్రాధాన్యం



సాక్షిప్రతినిధి, కరీంనగర్:

ఆకాశంలో సగం.. అవనిలో సగం.. అని మహిళల గురించి చెప్పే మాటలు బాగానే ఉన్నా.. ఆచరణలోకి వచ్చే సరికి ఎవరూ పాటించడం లేదు. రాజకీయాల్లోకి రావాలన్న ఆసక్తి ఉన్నా.. అవకాశాలు లేక మహిళలు అట్టడుగునే ఉంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో చూసుకుంటే.. మొత్తం ఓటర్లలో మహిళలే ఎక్కువగా ఉన్నారు. ఆ మేరకు రాజకీయంగా మాత్రం వారికి ప్రధాన రాజకీయ పార్టీలు ప్రాధాన్యం ఇవ్వలేదు. శాసనకర్తలు మహిళలు ఉంటే ఆ వర్గానికి మరింత న్యాయం జరుగుతుందనేది అందరూ ఏకీభవించాల్సిన వాస్తవం. మహిళలు అంతరిక్షంలో అడుగుపెడుతున్న ప్రస్తుత ఆధునిక యుగంలో రాజకీయాల్లో మాత్రం వారికి అంతగా ప్రాధాన్యం లభించడం లేదనే చెప్పవచ్చు. ఇందుకు ప్రస్తుత శాసనసభ ఎన్నికలు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో ప్రధానపార్టీల నుంచి 36 మంది బరిలో నిలిస్తే అందులో మహిళలు కేవలం ఐదుగురు మాత్రమే ఉండడం ఆయా పార్టీల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఇందులో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ నుంచి మహిళలకు అసలే ప్రాధాన్యం దక్కకపోగా, బీజేపీ నుంచి రామగుండం, సిరిసిల్ల, చొప్పదండి, జగిత్యాల సీట్లు అతివలకు కేటాయించారు. పెద్దపల్లి నుంచి బీఎస్పీ మహిళను బరిలో నిలపింది. బీజేపీ నాలుగు స్థానాలు కేటాయించి అగ్రస్థానంలో నిలిచింది. మహిళలు సైతం స్వతంత్రంగానైనా బరిలో నిలిచే సాహసం చేయకపోవడం సమాజంలో మహిళలంటే వివక్ష దూరం కాలేదన్న వాదనకు తెరలేపుతోంది.

అన్ని జిల్లాల్లో ఎక్కువే..
కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల్లో మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపోటములు మహిళలే శాసించనున్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా.. రాజకీయ పార్టీలు మహిళల జనాభా, ఓటర్లకు అనుగుణంగా రాజకీయ అవకాశాలు కల్పించడం లేదన్న అసంతృప్తి ఉంది. 50 శాతం రిజర్వేషన్ల పుణ్యమాని స్థానిక సంస్థల్లో సగానికిపైగా ప్రజాప్రతినిధులు మహిళలకు అవకాశం దక్కుతోంది. కానీ.. అసెంబ్లీకి వచ్చే సరికి మాత్రం మహిళలకు ప్రాధాన్యం దక్కడం లేదు. రాజకీయ పార్టీలు.. వారికి పోటీ చేసేందుకు ఇస్తున్న సీట్లు, అందులో వారు గెలిచే స్థానాలు.. పురుషులతో పోల్చితే చాలా తక్కువగా ఉంటున్నాయనే విమర్శ ఉంది.

దేశంలో ఇలా..
1998–2023 మధ్య కాలంలో దేశవ్యాప్తంగా 21,161 మంది ఎమ్మెల్యేలుగా ఎన్నిక కాగా.. వారిలో మహిళల సంఖ్య 1,584 మాత్రమే. ఏపీ, తెలంగాణ సహా దేశంలో 19 రాష్ట్రాల్లో మహిళా శాసనసభ్యులు 10 శాతానికి మించి లేరు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 1,821 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా.. అందులో బరిలో నిలిచిన మహిళల సంఖ్య 140 మాత్రమే. కానీ.. అందులో గెలిచిన మహిళల సంఖ్య కేవలం ఆరుమాత్రమే.

రాష్ట్రంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో...
2018 ఎన్నికల్లో తెలంగాణలో ఖానాపూర్ నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి అజ్మీరా రేఖానాయక్, మెదక్ నుంచి పద్మాదేవేందర్ రెడ్డి, మహేశ్వరం నుంచి పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి, ఆలేరు నుంచి గొంగిడి సునీతామహేందర్ రెడ్డి, ములుగు నుంచి సీతక్క, ఇల్లందు నుంచి బానోతు హరిప్రియ ఎన్నికయ్యారు. ఈ లెక్కన 119 నియోజకవర్గాల్లో ఎన్నికైన మహిళా శాసన సభ్యుల సంఖ్య కేవలం ఐదు శాతం మాత్రమే.

33 శాతం రిజర్వేషన్ అమలైతే..
మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంట్లో బిల్లు ఆమోదం పొందింది. అది చట్టంగా మార్చితే మహిళలకు ఆ మేరకు సీట్లు కేటాయించడం తప్పనిసరి. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం 2027 తర్వాతే ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకు వస్తామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. చట్టం అమల్లోకి వస్తే 12 నియోజకవర్గాలకు గాను ప్రతీ పార్టీ సుమారు నాలుగేసి స్థానాలు విధిగా కేటాయించాల్సి ఉంటుంది.

పకడ్బందీగా ఈవీఎంల కమిషనింగ్

- రిజర్వ్ కంట్రోల్ యూనిట్ల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ పూర్తి
- జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి



వేములవాడలో ఈవీఎంల కమిషనింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల, వేములవాడలోని ఉన్నత పాఠశాలలో రెండో రోజు శుక్రవారం ఈవీఎంల కమిషనింగ్‌ను పరిశీలించారు. సిరిసిల్ల, వేములవాడ రిటర్నింగ్ అధికారులు ఎస్.ఆనంద్‌కుమార్ మధుసూదన్ ఉన్నారు. అంతకుముందు కలెక్టర్ సిరిసిల్ల, వేములవాడ తహసీల్దార్ కార్యాలయాల్లోని పోస్టల్ బ్యాలెట్ ఫెలిసిటేషన్ సెంటర్లను పరిశీలించారు.

సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ పూర్తి

రిజర్వ్‌లో ఉన్న కంట్రోల్ యూనిట్ల మొదటి సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రిజర్వ్ కంట్రోల్ యూనిట్ల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ చేపట్టారు. కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ ఈనెల 23, 24 తేదీల్లో చేపట్టిన ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియలో సిరిసిల్ల నియోజకవర్గానికి సంబంధించి 2 వీవీ ప్యాట్‌లు, వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 1 బ్యాలెట్ యూనిట్, 2 కంట్రోల్ యూనిట్లు, 1 వీవీ ప్యాట్‌లో లోపాలున్నట్లు గుర్తించి వాటిని రిజర్వ్‌డ్ నుంచి తీసుకుని ర్యాండమైజేషన్ ప్రక్రియతో కేటాయించామన్నారు. కంట్రోల్ యూనిట్ సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ సంబంధించి హార్డ్‌కాపీలు, సాఫ్ట్‌కాపీలు రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించారు. అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్, కలెక్టరేట్ పరిపాలనాధికారి రాంరెడ్డి, ఈడీఎం శ్రీనివాస్, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్, డీటీ రెహమాన్ పాషా పాల్గొన్నారు.

ఈవీఎంల కమిషనింగ్ తనిఖీ

సిరిసిల్ల, వేములవాడల్లో ఈవీఎంల కమిషనింగ్‌ను ఎన్నికల పరిశీలకులు శుక్రవారం రాత్రి తనిఖీ చేశారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ జగదీశ్ సోన్‌కర్, ఎన్నికల వ్యయ పరిశీలకులు మణిగండసామి, పోలీస్ పరిశీలకులు వినీత సాహు ఈవీఎంల కమిషనింగ్‌ను పరిశీలించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఉన్నారు.

నేడు రాహుల్, యోగి రాక
- రేపు సీఎం కేసీఆర్



ఏర్పాట్లు చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

వేములవాడ: వేములవాడలో రాజకీయం వేడెక్కింది. ఎన్నికల తేదీ సమీపిస్తుండడంతో ఆయా పార్టీల అధినేతలు ప్రచారంతో కార్యకర్తల్లో హుషారు పెంచేందుకు వేములవాడ బాట పట్టారు. వేములవాడ అసెంబ్లీ సీటును ఎలాగైనా దక్కించుకోవాలని కాంగ్రెస్, పట్టునిలుపుకోవాలని బీఆర్‌ఎస్, తన ఖాతాలో వేసుకునేందుకు బీజేపీలు ప్రచారంతో దూసుకెళ్తున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్‌ను గెలిపించుకునేందుకు రాహుల్‌గాంధీ, బీజేపీ అభ్యర్థి వికాస్‌రావు కోసం యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ వస్తున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు తరఫున ప్రచారానికి ఆదివారం సీఎం కేసీఆర్ వస్తున్నారు.

జనసమీకరణలో బిజీ

ఎన్నికల ప్రచారం చివరి అంకానికి చేరడంతో భారీ జనసమీకరణతో బలనిరూపణకు అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. అయితే ఈసారి ప్రచారంలో మహిళలే ఎక్కువగా కనిపిస్తున్నారు. కులసంఘాలకు సైతం ఆఫర్లు ఇస్తూ ప్రచారానికి తీసుకెళ్తున్నారు.

నిర్వాసితులు ఎవరి వైపో?

- ముంపు గ్రామాలపైనే ప్రధాన పార్టీల దృష్టి
- రెండు అసెంబ్లీ సెగ్మెంట్లు.. 22 వేల మంది ఓటర్లు
- కీలకంగా మారిన ముంపు గ్రామాల ఓటర్లు



మిడ్‌మానేరు ప్రాజెక్టు

ముంపు గ్రామాల్లో ఓటర్లు ఇలా..

గ్రామం	మండలం	నియోజకవర్గం	ఓటర్లు
కొదురుపాక	బోయినపల్లి	చొప్పదండి	2,738
నీలోజిపల్లి	బోయినపల్లి	చొప్పదండి	1,366
వరదవెల్లి	బోయినపల్లి	చొప్పదండి	1,604
మాన్వాడ	బోయినపల్లి	చొప్పదండి	1,532
రుద్రవరం	వేములవాడఅర్బన్	వేములవాడ	2,780
అనుపురం	వేములవాడఅర్బన్	వేములవాడ	2,783
కొడుముంజ	వేములవాడఅర్బన్	వేములవాడ	986
చీర్లవంచ	వేములవాడఅర్బన్	వేములవాడ	3,306
చింతలఠాణా	వేములవాడఅర్బన్	వేములవాడ	2,158
సంకెపల్లి	వేములవాడఅర్బన్	వేములవాడ	1,402
ఆరెపల్లి	వేములవాడఅర్బన్	వేములవాడ	459
గుర్రంవానిపల్లి	వేములవాడఅర్బన్	వేములవాడ	310
శాభాశ్‌పల్లి	వేములవాడఅర్బన్	వేములవాడ	702

బోయినపల్లి(చొప్పదండి): అసెంబ్లీ ఎన్నికల సమయం దగ్గరపడుతుండడంతో ప్రచారం జోరందుకుంది. ఒక పార్టీపై మరో పార్టీ నాయకుల విమర్శలు, ప్రతివిమర్శలు వేడెక్కుతున్నాయి. మధ్యమానేరు ముంపు గ్రామాల్లోని ఓటర్లు ఎటు వైపు మొగ్గు చూపుతారోననే చర్చ సాగుతోంది. వేములవాడ, చొప్పదండి నియోజకవర్గాల పరిధిలో మిడ్‌మానేరు ముంపు గ్రామాలు విస్తరించి ఉన్నాయి. ఇప్పుడు వీరి ఓట్లు కీలకంగా మారాయి.

మిడ్‌మానేరులో 12 ముంపు గ్రామాలు

రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద నిర్మించిన మిడ్‌మానేరు ప్రాజెక్టులో బోయినపల్లి, వేములవాడ, ఇల్లంతకుంట, తంగళ్లపల్లి మండలాల్లోని 12 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ముంపు గ్రామాల నిర్వాసితులు ప్రస్తుతం ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో నివసిస్తున్నారు. చొప్పదండి నియోజకవర్గం బోయినపల్లి మండలంలోని కొదురుపాక, నీలోజిపల్లి, వరదవెల్లి, వేములవాడ నియోజకవర్గంలో.. వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం, అనుపురం, కొడుముంజ, శాభాష్‌పల్లి, చీర్లవంచ, చింతలఠాణా గ్రామాలు ఉన్నాయి.

మధ్యమానేరు ప్రాజెక్టు
ముంపు గ్రామాలు : 12
నియోజకవర్గాలు : వేములవాడ, చొప్పదండి
నిర్వాసిత ఓటరు : 22,126



కొదురుపాక ముంపు గ్రామం

22 వేల మంది ఓటర్లు

వేములవాడ, చొప్పదండి నియోజకవర్గాల్లో విస్తరించి ఉన్న మిడ్‌మానేరు ప్రాజెక్టు ముంపు గ్రామాల ప్రజలు సుమారు ఏడేళ్ల క్రితం నివాసాలకు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలకు తరలివెళ్లారు. వేములవాడ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా చల్మెడ లక్ష్మీనరసింహారావు, కాంగ్రెస్ అభ్యర్థిగా ఆది శ్రీనివాస్, బీజేపీ అభ్యర్థిగా చెన్నమనేని వికాస్‌రావు, బీఎస్పీ నుంచి గోలి మోహన్ పోటీ చేస్తున్నారు. చొప్పదండి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ నుంచి సుంకె రవిశంకర్, కాంగ్రెస్ నుంచి మేడిపల్లి సత్యం, బీజేపీ నుంచి బొడిగ శోభ, బీఎస్పీ నుంచి కొంకటి శేఖర్ బరిలో ఉన్నారు. వేములవాడ, చొప్పదండి.. రెండు నియోజకవర్గాల్లో కలిపి 22,126 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో చొప్పదండి నియోజకవర్గంలోని బోయినపల్లి మండలంలో 7,240 మంది, వేములవాడ నియోజకవర్గంలో 14,886 మంది ఓటర్లు ఉన్నారు.

11వేల పై చిలుకు నిర్వాసిత కుటుంబాలు

బోయినపల్లి, వేములవాడ మండలాల్లోని 12 ముంపు గ్రామాల్లో 11,590 పీడీఎఫ్(ప్రాజెక్టు డిస్‌ప్లేస్‌డ్ ఫ్యామిలీ), 141 పీఏఎఫ్ (ప్రాజెక్టు ఎఫెక్టెడ్ ఫ్యామిలీ) కుటుంబాలు నిర్వాసితులుగా మారుతున్నట్లు గతంలో పేర్కొన్నారు. 2008లో గెజిట్ జాబితా ప్రచురించారు. 12 ముంపు గ్రామాల్లో మెజార్టీ నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో ఇంటి స్థలం, పట్టా, ప్యాకేజీ, ఇళ్లు, యువతుల తదితర పరిహారాలు ఇచ్చారు. 2018 ముందస్తు అసెంబ్లీ ఎన్నికల ప్రకటనకు ముందు మాన్వాడ నిర్వాసిత కుటుంబాలకు ప్రత్యేక ప్యాకేజీ మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. గ్రామం యథాతథంగానే ఉంచుతూనే నిర్వాసిత కుటుంబాలకు నగదు పరిహారం అందించారు.

ముంపు గ్రామాల్లో పెండింగ్ సమస్యలు

మిడ్‌మానేరు ముంపు గ్రామాల నిర్వాసితుల్లో మెజార్టీగా పరిహారం అందినప్పటికీ మరికొందరికి మంజూరుకాలేదు. గెజిట్ మిస్సింగ్, వృత్తి మార్పిడి, యువతుల పరిహారం, పట్టా, ప్యాకేజీలు, అసైండ్ భూములు తదితర పెండింగ్ పరిహారాల మంజూరు కోసం చాలా ఏళ్లుగా నిర్వాసితులు ఎదురుచూస్తున్నారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు రూ.5.04 లక్షలు ఇవ్వాలని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

బీఆర్ఎస్ అరాచకాలకు అడ్డుకట్ట వేయాలి

- మాజీ మావోయిస్టు హరిభూషణ్



సుద్దాలలో మాట్లాడుతున్న హరిభూషణ్

కోనరావుపేట(వేములవాడ): బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు అడ్డుకట్ట వేయాలని ఉత్తర తెలంగాణ మావోయిస్ట్ మాజీ కార్యదర్శి హరిభూషణ్ కోరారు. కోనరావుపేట మండలం సుద్దాలలో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక అరాచకాలకు పాలపడుతుందన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని, వేములవాడలో ఆది శ్రీనివాస్ విజయానికి కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, జిల్లా నాయకులు కచ్చకాయల ఎల్లయ్య, ఉప్పుల గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య తోపులాట

మెట్‌పల్లి(కోరుట్ల): జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో శుక్రవారం ఒకే చోట ప్రచారానికి వచ్చిన బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య స్వల్ప గొడవ చోటుచేసుకుంది. స్థానిక పాత బస్టాండ్ సమీపంలో ఉన్న మసీదు వద్ద ముస్లింలను కలవడానికి ఇరు పార్టీల నాయకులు వచ్చారు. ఈ సందర్భంగా ఓట్లు అభ్యర్థిస్తుండగా అదే సమయంలో ఇరువైపులా కొందరు నాయకులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న బీఆర్ఎస్ వాహనాలకు కొందరు కాంగ్రెస్ స్టిక్కర్లను అతికించడం ఉద్రిక్తతకు దారి తీసింది. దీంతో ఇరు పార్టీల నాయకులు పరస్పరం దూషించుకుంటూ దాడులకు ప్రయత్నించారు. అక్కడే బందోబస్తులో ఉన్న పోలీసులు వెంటనే జోక్యం చేసుకొని వారిని చెదరగొట్టి పంపించారు.

అంగన్‌వాడీ ఆయా కుటుంబాన్ని ఆదుకోవాలి



ఆయా కుటుంబాన్ని పరామర్శిస్తున్న రాములు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని అక్కపల్లికి చెందిన అంగన్‌వాడీ ఆయా అక్కినపల్లి సత్తమ్మ గుండెపోటుతో మృతిచెందిందని, వారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు కోరారు. మృతురాలి కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించి మాట్లాడారు. ఉద్యోగ విరమణకు దగ్గరలో ఉన్న ఆమె మరణించడం బాధాకరమన్నారు. సత్తమ్మ కుమారుడు గతంలో అనారోగ్యంతో మరణించాడన్నారు. ఆమె మరణంతో కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉందని, వారి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కొరియర్ క్రాంతి, గాజుల దేవయ్య, పండుగ పోచమ్మ ఉన్నారు.

బీఆర్ఎస్‌కు జగ్గారావుపల్లి ఎంపీటీసీ రాజీనామా

బోయినపల్లి(వేములవాడ): మండలంలోని జగ్గారావుపల్లి ఎంపీటీసీ సభ్యురాలు కొంకటి శిరీష బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పార్టీలో ఎస్సీలకు ప్రాధాన్యత లేదని, కొందరు ఒంటెద్దు పోకడలతో పోతుండడం నచ్చక పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

'నూలు'వెచ్చని వ్యాపారం



చలి నుంచి రక్షించుకునేందుకు ప్రజలు స్వెట్టర్లు, రెగ్జిన్లు కొనుగోలు చేస్తున్నారు. రెండు రోజులుగా వాతావరణం చల్లబడడంతో సిరిసిల్లలోని స్వెట్టర్ల షాపుల వద్ద జనం గుమిగూడి కనిపించారు. ఉలెన్‌వస్త్రాలు, రెగ్జిన్‌కోట్లు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు. వ్యాపారులు మాట్లాడుతూ తమ వద్ద రూ.500 నుంచి రూ.3వేల వరకు వివిధ రకాల రెగ్జిన్లు, స్వెట్టర్లు ఉన్నాయని తెలిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల







ఈ లొల్లి వద్దు బిడ్డో..!

- కొట్లాటలకు పోయి కష్టాలు తెచ్చుకోకు బిడ్డా
- ఎన్నికల వేళ కొడుకుకు బుద్ధి చెబుతున్న తల్లి
- ప్రతీ తల్లి ఆవేదన ఇదీ..

చందుర్తి(వేములవాడ): అసెంబ్లీ ఎన్నికల గడువు దగ్గర పడుతోంది. గ్రామాల్లో ఎన్నికల ప్రచారం వేడెక్కింది. అభ్యర్థుల గెలుపు కోసం ఆయా పార్టీల నాయకులు పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. రెండు వేర్వేరు పార్టీల నాయకులు ఎదురుపడితే దాదాపు గొడవకు దిగే పరిస్థితులు ఉంటున్నాయి. పల్లెల్లో వీటన్నింటిని గమనిస్తున్న ఓ తల్లి తన ఆవేదనను కొడుకుతో ఇలా పంచుకుంటుంది.

తల్లి: ఏరా బిడ్డ పొద్దున్నే తయారయ్యావు ఎక్కడికి పోతున్నావు?

కొడుకు: ఇంకెక్కడికి అమ్మా ఎన్నికల ప్రచారానికి. ఈసారి అన్న గెలవాలి.

తల్లి : మనకెందుకు రాజకీయాలు బిడ్డా. కష్టం చేస్తే కానీ ఇల్లు గడువదు.

కొడుకు : అన్న గెలిస్తే మన కష్టాలన్నీ తీరుతాయమ్మా.

తల్లి : చేండ్ల పత్తికి నీళ్లు పెట్టాలని, కల్లంలో వడ్లు ఉన్నాయని.. అయ్యా రోజు లొల్లి పెడుతుండ్రా.

కొడుకు : పని ఎప్పుడూ ఉండేదేనే అవ్వ. ఓట్లు ఐదోళ్లకోసారి వస్తాయి. మనను నమ్ముకున్నోళ్ల కోసం మనం పనిచేయకపోతే అన్న ఎట్లా గెలుస్తాడే.

తల్లి : యాభై ఏళ్లుగా చూస్తున్నాం. మన బతుకుల కన్న వారి బాగోగులే చూసుకుంటున్నారు. నీకు ఇంట్లో చెల్లె ఉంది. బాగా చదివించి పెళ్లి చేయాలే. ఒక్కగానొక్క కొడుకువి. నీకేమైన అయితే మా బతుకులు ఏమి కావాలి బిడ్డా.

కొడుకు : ఏ.. ఎందుకు భయపడుతావు అవ్వా.

తల్లి : బాగా ఆలోచించు కొడుకా.. మనవి చిన్న బతుకులు. ఆవేశంలో పోయి గొడవల్లో తలదూర్చితే మనకే నష్టం. నీవు గొడవలు పెట్టుకునేది కూడా ఎవరితోనే కాదు మన ఊరోళ్లతోనే. వారం రోజుల్లో ఎన్నికలు అయిపోతాయి. ఆ తర్వాత మనం చచ్చే వరకు ఊళ్లోనే ఉండాలే బిడ్డా.. మనకు ఏమైనా అవసరం ఉన్న ఈళ్లే ముందుండాలే కద రా.. ఈ లొల్లి మనకెందుకు బిడ్డా.

కొడుకు : అమ్మా.. నువ్వు చేప్పేది నిజమే. నేను ఎందుకు గొడవకు పోతానే. ఊళ్లో ఎవరూ కనిపించిన అత్తా.. మామ.. బాబాయ్.. పిన్ని.. అన్న.. అని పలకరిస్తా. వాళ్లతో నాకెందుకు గొడవ.

తల్లి : నువ్వు చిన్నపిల్లగాడివి బిడ్డా. ఎవరు మంచోళ్లో.. ఎవరు చెడ్డోళ్లో.. గుర్తించి ఓట్లేద్దాం. డబ్బుకు, మద్యానికి లొంగకు, ఒక్కరోజు బిర్యానీ పెడితే ఐదేళ్లు కడుపు నిండదు. ఐదేళ్లపాటు మనకు కష్టాలు రాకుండా చూసుకుంటూ, మన కష్టసుఖాల్లో పాలుపంచుకునే నాయకున్ని గెలిపించుకుందాం బిడ్డా.

కొడుకు: అలాగే అమ్మా.. ఈ గొడవలు నాకొద్దు. మంచి చేసే వారికే ఓటేస్తాను. ఏ పార్టీ నాకొద్దు. ఇవ్వాల్లి నుంచి ఏ పార్టీ వాళ్లతోని తిరుగను. చేండ్లకు పోతున్న. నవ్వు చెప్పిట్లే మంచి నాయకునికే ఓటేద్దాం.

ప్రలోభాలు షురూ..

- సిరిసిల్లలో బొట్టు బిళ్లల పంపిణీ
- తాయిలాలు సిద్ధం



సిరిసిల్లలో పంపిణీ చేస్తున్న బొట్టుబిళ్లల ప్యాకెట్

సిరిసిల్ల: శాసనసభకు జరిగే ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్నకొద్దీ బరిలో నిలిచిన అభ్యర్థుల్లో గెలువాలనే పట్టుదల పెరుగుతోంది. ఓటర్లను ఎలాగైనా తమ వైపు తిప్పుకోవాలనే లక్ష్యంతో ప్రలోభాలకు తెరలేపుతున్నారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో 37 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరికి వారు గెలుపు ధీమాతో ముందుకు సాగుతున్నారు. సిరిసిల్ల ఎన్నికల బరిలో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన పత్తిపాక సురేశ్ శుక్రవారం సిరిసిల్లలో ఇంటింటికి బొట్టు బిళ్లల ప్యాకెట్లను పంపిణీ చేశారు. 16 బొట్టు బిళ్లలతో ఉన్న ప్యాకెట్లను ఇంటింటికీ పంపిణీ చేస్తూ.. తన ఫొటోను, తనకు ఎన్నికల అధికారులు కేటాయించిన గుర్తును ముద్రించి 'జై హింద్' అని 'దీర్ఘసుమంగళి భవ' అని, 'అణచివేత ఎక్కడో.. తిరుగుబాటు అక్కడ' అనే నినాదాలతో ముద్రించిన ప్యాకెట్‌సైజ్ బుక్‌లో బొట్టు బిళ్లలను ఉంచి పంపిణీ చేశారు. ఎన్నికల్లో ఓటర్లను ఆకట్టుకునేందుకు పత్తిపాక సురేశ్ సిరిసిల్లతోపాటు నియోజకవర్గం మొత్తంగా బొట్టు బిళ్లల ప్యాకెట్లను పంపిణీకి సిద్ధమయ్యారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం తప్పని తెలిసినా.. చిరుకానుక కదా అని బొట్టు బిళ్లలను అందించడం స్థానికంగా చర్చనీయాంశమైంది. దీనిపై ఎన్నికల అధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి మరి. ఏది ఏమైనా.. ఎన్నికల తేదీ దగ్గర పడుతున్నకొద్దీ రాజకీయ పార్టీలు ప్రచారజోరు పెంచాయి. సర్వత్రా ఎన్నికల ఫలితాలపై చర్చ సాగుతోంది.

కులసంఘాలపై ఖాకీల నిఘా

- సభలు, సమావేశాలకు చెక్
- నోటీసులు ఇస్తున్న పోలీసులు

సిరిసిల్లక్రైం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కులసంఘాల బలాన్ని చేజిక్కించుకునేందుకు నేతలు చేసే ప్రయత్నాలకు చెక్ పడింది. ఇక నుంచి కులసంఘ భవనాల్లో ఏ పార్టీ సమావేశాలు, భోజనాలు, ఓట్లను అభ్యర్థించేందుకు గుమిగూడరాదని పోలీసులు నోటీసులు జారీ చేస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం వేములవాడ సబ్ డివిజన్ పరిధిలోని పలు గ్రామాల్లోని కులసంఘాల నేతలకు సంఘం తరఫున పోలీసులు నోటీసులు అందాయి. ఓట్లు అడిగేందుకు నేతలు అభ్యర్థిస్తే ఇప్పటి వరకు సంఘ భవనాల్లో కూర్చుని ఒక నిర్ణయానికి వచ్చేవారమని కానీ ఈసారి ఎన్నికల్లో కొత్త పంథాలో అసలు భవనాల్లో భోజనాలు సైతం ఏర్పాటు చేయరాదన్న నిబంధనలు ఆలోచనలో పడేస్తున్నాయి.

ఇప్పటికే అద్దెకు తీసుకున్న వాటి మాటేంటి?

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థుల్లో కొందరికి పార్టీపరంగా కార్యాలయాలు లేకపోవడంతో సంఘ భవనాలు, కల్యాణ మండపాలను అద్దెకు తీసుకున్నారు. అక్కడి నుంచే రోజువారి ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తాజాగా పోలీసులు ఇస్తున్న నోటీసుల్లో సంఘ భవనాలు, ఫంక్షన్ హాల్స్, పార్టీ కార్యకలాపాలకు వినియోగించరాదన్న నిబంధనలు ఉండడంతో ఏం చేయాలనే సందేహంలో కొందరు అభ్యర్థులు తర్జనభర్జన పడుతున్నట్లు తెలిసింది. ఈ నిబంధనలపై స్పష్టత ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

కండక్టర్ నిజాయితీ

- ల్యాప్‌టాప్ అప్పగింత



సిరిసిల్లటౌన్: ఆర్టీసీ కండక్టర్ నిజాయితీకి అభినందనలు వెల్లువెత్తాయి. ప్రయాణికుడు పోగొట్టుకున్న ల్యాప్‌టాప్‌ను అప్పజెప్పిన కండక్టర్‌ను పలువురు అభినందిస్తున్నారు. సిరిసిల్ల డిపోకు చెందిన బస్సు వరంగల్ నుంచి వేములవాడకు వస్తుండగా బ్యాంక్ ఉద్యోగి సుంకరి వినీత్ తన ల్యాప్‌టాప్‌ను బస్సులోని మరిచిపోయాడు. కండక్టర్ శంకరయ్య గమనించి సిరిసిల్ల డిపోలో అప్పగించాడు. శుక్రవారం సాయంత్రం సిరిసిల్ల డీఎం మనోహర్, ఎస్టీఐ సారయ్య, హెడ్‌గార్డ్ వెంకన్న, సూపరింటెండెంట్ శ్రీనివాస్ చేతుల మీదుగా ల్యాప్‌టాప్‌ను అందజేశారు.

ఎమ్మెల్యే గారూ.. మీరు మా గ్రామానికి రావద్దు



కోరెం-అనంతపల్లి దారిలో ఫ్లెక్సీలు

బోయినపల్లి(చొప్పదండి): గౌరవనీయులు చొప్పదండి శాసనసభ్యులు గారు మీరు మా గ్రామానికి రావద్దని రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కోరెం-అనంతపల్లి మార్గంలో శుక్రవారం ఫ్లెక్సీలు వెలిశాయి. స్థానికంగా ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పర్యటన ఉన్న నేపథ్యంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం చర్చకు దారితీశాయి. దళితబంధు అమలుపరచాకే రండి.. మీకు రెడ్ కార్పెట్‌తో స్వాగతం పలుకుతాం.. కోరెం-గుండన్నపల్లి బీటీ రోడ్డు, కల్వర్టు పనులు చేశాకే రండి.. మీరు మా ఊరికి ఏకగ్రీవ హామీ రూ.25లక్షలు ఇచ్చాకే రండి అని ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం సంచలనం రేపింది. మూడు హామీలపై మూడు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

మాకు గుర్తింపు కావాలి

సాక్షి పీపుల్స్ ఎజెండా

- ఆర్ఎంపీల డిమాండ్

కోనరావుపేట(వేములవాడ): రాత్రింబవళ్లు పల్లెల్లోనే ఉంటూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న ఆర్ఎంపీ, పీఎంపీలు తమకు గుర్తింపుకావాలని కోరుతున్నారు. జిల్లాలో సుమారు 980 మంది గ్రామీణ వైద్యులు పనిచేస్తున్నారు. ప్రజల ఆరోగ్యమే పరమావధిగా భావిస్తూ పనిచేస్తున్న వారికి దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. తర్వాత ఆర్ఎంపీలను పట్టించుకునే వారు లేరు. ఎన్నికల నేపథ్యంలో తమ సమస్యలను పట్టించుకోవాలని ఆర్ఎంపీలు కోరుతున్నారు. గ్రామాల్లో ప్రజలకు ఏ చిన్న అవసరమొచ్చినా మేమున్నామంటూ నిరంతరం సేవలందిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలు తమ అభిప్రాయాలను ఇలా వెలిబుచ్చారు.

ప్రభుత్వం గుర్తించాలి



గ్రామాల్లో పనిచేస్తున్నమమ్ములను ప్రభుత్వం గుర్తించాలి. గ్రామాల్లోనే ఉంటూ రాత్రి, పగలు తేడా లేకుండా ప్రజలకు వైద్యసేవలందిస్తున్నాం. కానీ ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం నుంచి ఎలాంటి గుర్తింపు లేదు. ఇప్పటికైనా ప్రభుత్వాలు మమ్ములను గుర్తించాలి.

– బెజ్జంకి రవీందర్, రాష్ట్ర అధికార ప్రతినిధి, ఆర్ఎంపీ అసోసియేషన్

పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలి



గ్రామాల్లో ఉంటూ గ్రామీణులకు వైద్య సేవలందిస్తున్న ఆర్ఎంపీలకు గతంలో కరీంనగర్‌లో శిక్షణ ఇచ్చారు. అయితే ఆ శిక్షణకు సంబంధించిన సర్టిఫికెట్లు ఇప్పటికీ ఇవ్వలేదు. గ్రామాల్లో పనిచేస్తున్న వైద్యులకు పూర్తిస్థాయిలో శిక్షణనిచ్చి సర్టిఫికెట్లు అందించాలి.

– ఇల్లందుల వెంకటేశం, సీనియర్ వైద్యుడు

పల్లె దవాఖానాల్లో అవకాశం ఇవ్వాలి



మారుమూల పల్లెల్లో పనిచేస్తున్న వైద్యులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంది. ప్రస్తుతం గ్రామాల్లో కొత్తగా ఏర్పాటు చేస్తున్న పల్లె దవాఖానాల్లో అర్హత, అనుభవం ఉన్న ఆర్ఎంపీ, పీఎంపీలకు అవకాశం ఇవ్వాలి.

– అవదూత శ్రీధర్, ప్రైవేట్ వైద్యుడు



రాజన్నకు జనసందడి

వేములవాడ: రాజన్నను శుక్రవారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు కోడెమొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో కార్తీకదీపాలు వెలిగించారు. ఆలయ అధికారులు భక్తుల ఏర్పాట్లను పరిశీలించారు.

తన్నుకున్న బీజేపీ నాయకులు



ఆరా తీస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండల బీజేపీ కార్యాలయంలో గురువారం రాత్రి ఆ పార్టీ నాయకుల మధ్య గొడవ జరిగిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. ఎన్నికల ప్రచారం ముగించుకుని పార్టీ కార్యాలయానికి చేరుకున్న నాయకులు, కార్యకర్తలు సమావేశమయ్యారు. ఎమ్మెల్యే అభ్యర్థి మండలంలో ప్రచారం చేసేందుకు రూట్ మ్యాప్ కోసం చర్చిస్తుండగా బీజేపీ సీనియర్ నాయకుడు రేగులపాటి సుభాష్‌రావు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో రెండు వర్గాలుగా చీలిపోయిన కార్యకర్తలు ఒకరిపై ఒకరు దాడికి దిగగా పలువురి చొక్కాలు చిరిగిపోయాయి. అరుపులు కేకలతో చుట్టుపక్కల ప్రజలు భయంభ్రాంతులకు గురయ్యారు. డబ్బుల పంపిణీ విషయంలో గొడవ జరుగుతుందని భావించి సీవిజిల్‌కు ఫిర్యాదు చేయడంతో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు చేరుకుని తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో పోలీసులు కూడా చేరుకోవడం తోమా పార్టీ కార్యాలయం నుంచి ఎక్కడి వారక్కడ వెళ్లిపోయారు. ఈ గొడవ శుక్రవారం కూడా కొనసాగింది. గోపాలరావుపల్లెలోని సుభాష్‌రావు ఇంటికి సుమారు 50 మంది బీజేపీ కార్యకర్తలు చేరుకుని గొడవకు ప్రయత్నించగా పోలీసులు శాంతింపజేశారు.

హత్యాయత్నం కేసులో ఒకరికి జైలు

వేములవాడ: భార్య కాపురానికి రాకపోవడానికి కారకుడనే అనుమానంతో ఇంటికెళ్లి అతని భార్యపై హత్యాయత్నానికి పాల్పడిన నేరంలో నిందితుడు సింగిరెడ్డి వెంకటేశ్‌కు మూడు నెలల జైలు శిక్ష లేదా రూ.వేయి జరిమానా విధిస్తూ వేములవాడ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి నట్టు రవీందర్ శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వివరాలు. బోయినపల్లి మండలం నీలోజిపల్లికి చెందిన కొంకటి లచ్చిరెడ్డి బంధువుల అమ్మాయితో అదే గ్రామానికి చెందిన సింగిరెడ్డి వెంకటేశ్‌తో వివాహమైంది. వెంకటేశ్ తరచూ తన భార్యతో గొడవ పడగా ఆమె అతన్ని వదిలి తల్లి గారింటికెళ్లింది. తన భార్య కాపురానికి రాకపోవడానికి కారణం లచ్చిరెడ్డి అని వెంకటేశ్ కక్ష పెంచుకున్నాడు. 2022, జనవరి 14న గొడ్డలి పట్టుకొని లచ్చిరెడ్డిపై దాడి చేసేందుకు అతని ఇంటికెళ్లాడు. ఆ సమయంలో లచ్చిరెడ్డి ఇంట్లో లేకపోవడంతో అతని భార్య యాదమ్మపై దాడికి ప్రయత్నించగా ఆమె తప్పించుకుంది. ఈ సంఘటనపై యాదమ్మ ఫిర్యాదుతో బోయినపల్లి పోలీసులు వెంకటేశ్‌పై కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ బన్సీలాల్ దర్యాప్తు చేపట్టారు. సాక్షులను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గౌరు రాజిరెడ్డి, గడ్డం లక్ష్మణ్ కోర్టులో ప్రవేశపెట్టి విచారించారు. సాక్ష్యాదారాలను పరిశీలించిన జడ్జి వెంకటేశ్‌కు మూడు నెలల జైలు శిక్ష లేదా జరిమానా విధించారు.

బీఆర్ఎస్ పాలనలో అడ్డగోలు అక్రమాలు

- సిరిసిల్ల వనరులు కొల్లగొట్టారు
- ప్రతిపక్షాలపై కక్షసాధింపు చర్యలు
- ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు కిశోర్



మాట్లాడుతున్న వల్లాల కిశోర్

సిరిసిల్లటౌన్: బీఆర్ఎస్ పాలనలో అడ్డగోలు అక్రమాలు జరిగాయని, ముఖ్యంగా సిరిసిల్ల సహజ వనరులను కొల్లగొట్టారని ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు వల్లాల కిశోర్ ఆరోపించారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. సిరిసిల్లలో ఇసుక మాఫియాకు పెట్టింది పేరుగా బీఆర్ఎస్ పార్టీ మారిందని ఆరోపించారు. అక్రమ ఇసుక తరలింపుపై తమ పార్టీ నాయకుడిని బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. ఈవిషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఓట్లు వేయాలని కోరారు. నాయకులు సోమిశెట్టి దశరథం, బామండ్ల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో హెల్పర్ మృతి

- ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేస్తుండగా సంఘటన
- పోతుగల్‌లో విషాదం



శ్రీనివాస్(ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేస్తుండగా కరెంట్‌షాక్‌తో ఓ హెల్పర్ దుర్మరణం చెందాడు. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు. ముస్తాబాద్ మండలం పోతుగల్‌కు చెందిన జంగ నాంపెల్లి, సౌందర్య దంపతుల కొడుకు శ్రీనివాస్(22) రెండేళ్లుగా గ్రామంలో అసిస్టెంట్ హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. గంగమ్మ ఆలయం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం మరమ్మతు చేస్తుండగా.. పై నుంచి వెళ్తున్న హెచ్‌టీ లైన్‌కు అతని చేతిలోని తీగ తగిలింది. దీంతో విద్యుత్ షాక్‌తో శ్రీనివాస్ కింద పడిపోయాడు. ఆస్పత్రికి తరలిస్తుండగానే మృతిచెందాడు. ఆరు నెలల క్రితం ఇలాగే విద్యుత్‌షాక్‌కు గురై గాయాలతో బయటపడ్డాడు. ఒక్కాగానొక్క కొడుకు మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. బాధిత కుటుంబాన్ని సెస్ తరఫున ఆదుకుంటామని రూ.5లక్షల పరిహారం ఇస్తామని డీఈఈ హామీ ఇచ్చారు. కాగా శ్రీనివాస్ కుటుంబానికి రూ.10లక్షల పరిహారం ఇచ్చి, ఉద్యోగం కల్పించాలని బాధితుని బంధువులు డిమాండ్ చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు.

చేపలవేటకు వెళ్లి గిరిజన మహిళ మృతి

- నీటిలో మునిగి ఊపిరాడక మృతి
- కల్‌నాయక్ తండాలో విషాదం



లక్ష్మి మృతదేహం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కూతురుతో కలిసి చేపలవేటకు వెళ్లిన ఓ గిరిజన మహిళ నీటమునిగి మృతిచెందింది. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ శివారులోని కల్‌నాయక్‌తండాలో విషాదం నింపింది. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. తండాకు చెందిన భూక్య లక్ష్మి(40) తన కూతురు కల్యాణితో కలిసి శుక్రవారం తండా శివారులోని ఒర్రె వద్దకు చేపలు పట్టడానికి వెళ్లారు. అక్కడ ఉన్న చిన్నమడుగులో చీరతో చేపలు పడుతుండగా.. లక్ష్మి కాలు జారి నీటిలో పడింది. తల్లి నీట మునగడంతో ఒడ్డున ఉన్న కల్యాణి తన దగ్గర ఉన్న ఫోన్‌తో తండావాసులకు సమాచారం ఇచ్చింది. తండావాసులు మడుగు వద్దు చేరుకొని లక్ష్మిని బయటకు తీయగా అప్పటికే ఆమె మృతిచెందింది. లక్ష్మి కూతురు కల్యాణి వివాహం వచ్చే నెలలో ఉంది. లక్ష్మి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కల్యాణి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ముగ్గురిపై కేసు



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని దుమాల ఎక్స్‌రోడ్డు వద్ద శుక్రవారం రాత్రి పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు చేశారు. ఎస్సై రమాకాంత్ మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల సమయంలో వాహనదారులు సరైన ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. నంబర్‌ప్లేట్ లేని వాహనాలపై ప్రయాణిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు.